(5)

# కథలు రాసే భార్య

ఒక పత్రికలో శ్రీమతి మేఘమాలాదేవి వ్రాసిన కొత్తకథని చదువుతున్నాను. వ్రాతప్రతిగా కథని నే చూసినదే ఐనా అచ్చులో ఎందువల్లో అందంగా కన్పడసాగింది.

పొద్దున్నే స్నానంచేసి వేడికాఫీ తాగడంవల్ల కలిగిన నవీనత్వం (ఫ్రెష్ నెస్) వల్లకూడా కథ అనుకున్న దానికంటె గొప్పగా ఉన్నట్టనిపించ సాగింది.

అంతల్లోకి ఎవరో వీధిలోంచి, 'శ్రీమతి మేఘమాలాదేవిగారిల్లు ఇదేనాండి?' అని ప్రశ్నించడం వినపడి, వీధిఅరుగు మీదికెళ్ళి చూడగానే ఎవరో నలుగురు ఆధునిక దుస్తులను ధరించిన నాగరీకులు నాదృష్టిపథంలో పడ్డారు.

'అవునండి!' అన్నాను నేను.

వాళ్ళు పరస్పరం చూపుల్తోనే ప్రశ్నించుకుంటూ చూసుకోసాగారు. చివరికి ఒకాయన తెగించి, "మేం ఆవిడతో ఇంటర్వ్యూ చెయ్యాలనుకుని వొచ్చాచమండి!" అన్నాడు.

వాళ్ళని లోపలికి ఆహ్వానించి కుర్చీలమీద ఆసీనులు కమ్మనమని సవినయంగా విన్నవించు కొన్నాను. వాళ్లుకూచుని గదినంతా వెయ్యి కన్నులు చేసుకుని పరీక్షగా చూడసాగారు. ఒకటి, రెండు చిత్రాలు కాల్టక్స్, ఫోర్లీస్, కాస్ట్రిల్, గుడ్ లాస్ మొదలైన కంపెనీల క్యాలెండర్లు వాళ్ళ దృష్టిని ఆకర్షించాయి గావును, తదేకధ్యానంతో కొన్ని క్షణాలు పరికించ సాగారు.

ఇందాకటి ఆయనే, 'మీరు...ఆవిడ...?' అన్నాడు.

"అవునండి. భర్తను" అన్నాను. పూర్తిచేస్తూ.

"అదృష్టవంతులు"

"ఏం?"

"అంత గొప్పరచయిత్రి భర్తకావడంకంటె అదృష్టం ఏముంటుంది?"

నాకళ్ళు గర్వంతో మెరిశాయి.

"మీరెవరో తెల్సుకోవచ్చునా?" అని ఎదురు ప్రశ్నించాను.

"మేం ఈవూళ్ళో 'కళాంజలి' అనే కథల మాసపత్రికను నడపడానికి సంకల్పించుకున్నాం. దానికి వారి అమూల్యమైన కథానికను అడగాలని వొచ్చాం" అన్నాడొకడు.

"ఓ దానికేం భాగ్యం! దానికి మీరింత శ్రమతీసుకోవడం దేనికి? ఒక కార్డు గీకిపారేసినా మీకు కథ అందివుండేదికద!"

"అంతేననుకోండి! కాని ఆవిడను స్వయంగా కలిసి, రిక్వెస్టుచేసినదానికి..." మిగతాది అభినయ పూర్వకంగా వెల్లడిచేశాడు.

నేను సమాధానంగా కృతజ్ఞతాపూర్వకమైన చిరునవ్వు నవ్వాను.

మొదటివ్యక్తి 'కళాంజలి' నడపడంలోని వాళ్ళ ఆశయాల్ని, వాళ్ళ ఆర్థికబాధల్నీ, ఇంకా ఎన్నో విషయాల్ని గురించి ఏకరువు పెట్టాడు. నేనంతా శ్రద్ధగావిని వాళ్ళనభినందించాను.

నేను నా మేఘమాల రాస్తున్న కథలనీ, నవలనిగురించీ కొన్ని పత్రికలు రాయదల్చుకున్న సీరియల్ రచనలనుగురించి,

లెక్చరిచ్చాను. వాళ్ళు చాలా సంతోషించినట్టుగా భావ ప్రకటనలు చేశారు,

అందరికి మాట్లాడవల్సినవన్నీ అయిపోయాయి. ఎవరికీ ఏమీ తోచలేదు.

ఒకాయన నేను వసూలుచేసిన క్యాలెండర్ల అందచందాల్ని, నాఆర్టిస్టు తత్వాన్ని, స్తుతించి మరికొంత కాలంఖర్చు చేశాడు. చివరికి అదీ ఐపోయింది.

కొన్ని క్షణాలు అందరం మూగనోము పట్టినట్టు మౌనాన్ని వరించాం. కాసేపటికి అదీ భరింపరానిదైంది.

వాళ్ళ నాయకుడే మళ్ళీ "ఆవిడనోసారి పిలుస్తారా? మాకోరిక చెప్పేసి వెళ్ళిపోతాం" అన్నాడు.

నేను సందిగ్ధంలో పడ్డాను. కాని ఆ ఇంటరవ్యూ అనవసరమని నా అంతరాత్మ ప్రబోధిస్తోంది. అందుకని "నే చెబుతాగా - మీకేం శ్రమ అక్కర్లేదు. ఓవారంరోజుల్లో మీకు కథ చేరేలా చూస్తా" నని ధైర్యం చెప్పాను.

వాళ్ళ మొహాల్లో నిరాశ విస్పష్టంగానే కనపడసాగింది. కాని నేనుమాత్రం ఏంచెయ్యను. నిస్సహాయుణ్ణి. అయిష్టంగా ఏపని చెయ్యను.

ఆఖరికి వాళ్ళే శలవు తీసుకుని ఇంటిముఖం పట్టారు. నన్నుగురించి వాళ్ళు మనసుల్లో ఏమనుకుంటారో నేను గ్రహించినప్పటికీ, ఏమీచెయ్యలేని స్థితిలో ఉండడంవల్ల వాళ్ల నమస్కారాలకు, ప్రతి నమస్కారమేచేసి, సెలవు ఇచ్చి పంపాను.

మధ్యాహ్నం భోజనాలయ్యాక నేను తూగుటుయ్యాల మీద పడుకున్నాని, తమలపాకుల చిలకలు సేవిస్తుంటే, మేఘమాల ప్రక్కని కూచుని, నెమ్మదిగా ఉయ్యాలనూపుతూ, చిలకలుచుట్టి నోటికి అందిస్తోంది.

"ప్రొద్దున్న నీకోసం ఎవరోవచ్చారు?"

"ఎవరు?"

"'కళాంజలి' పత్రికవారుట"

"ఏమంటారు?"

"వాళ్ళ పత్రికకు ఒక కథానిక కావాలట!"

"మీరేమన్నారు?"

"ఒక వారంరోజుల్లో పంపించేలా చేస్తానన్నాను; కాని వాళ్ళు నిన్ను చూడాలని పట్టుబట్టారు.

"గొప్పచిక్కే వచ్చిందన్నమాట!"

"అవసరంలేదు అని ఖచ్చితంగా చెబితేగాని వొదల్లేదు.

'నేచెబితే విన్నారూ? మీరేదో నాలుగు కథలు రాసుకోక నన్నుకూడా ఆరంగంలోకి దింపేవరకూ నిద్రపోలేదు; ఇప్పుడు చూడండి— ఎలాంటి చిక్కులు వొస్తున్నాయో?'

'మరేం ఫరవాలేదు'

'ఐతే కథెప్పుడు రాద్దామంటారు?'

'నే చెబుతాగా'

ఉయ్యాల ఊగులాటలో చక్కని నిద్రపట్టింది.

వారం రోజులు గడచాయి; కథ తయారుకాలేదు. అనుకొన్నప్పుడల్లా కథ తయారు కావడానికి అదేం యంత్రాలు చేసే పనైతేగా!

అసలు మేఘమాల రచయిత్రి కావడమే విచిత్రమైన విషయం! పెళ్ళి చదువుకని బళ్లో చేర్పించిన ఆమెని, పెళ్ళి ఎంతకూ కాకపోవడంవల్ల, ఇంటర్మీడియేట్ వరకూ చదివించారు వాళ్ళవాళ్ళు. అప్పటికిగాని కట్నాలమీంద ఆశ లేకపోవడమే ఆశయంగాగల నాలాంటి సంస్కారి (నిర్భాగ్యు డనుకో వచ్చు మీలో కొందరు) దొరకలేదు. మా మామయ్యకు నేనింత చవకగా రావడం ఆయన ఘనతేనని ఆయన అనుకొంటున్నప్పటికీ, నేచేసిన సంస్కారయుతమైన చర్యనాకు ప్రతి పనిలోనూ ప్రొత్సాహమిస్తూనే వుంటోంది.

కాని కట్నాన్ని కాలదన్నానన్న మావాళ్ళ కడుపుమంట రావణాసురిడి కాష్టంలా ఇప్పటికీ రాజుకుంటోనేవుంది, అజ్ఞాతంగా – అవసరమైనప్పుడు నామీంద విరుచుకు పడడానికి సిద్ధంగా.

కట్నాన్ని వొదులు కున్నందుకు నేనెప్పుడూ విచారించలేదు. గాని మేఘమాల పుస్తకాల అచ్చుకు ఏ పబ్లిషరూ సహాయం చెయ్యనప్పుడూ చివరకి మా మామయ్య అప్పైనా ఇయ్యనన్నందుకూ, వొదులుకున్న కట్నం ఈసద్వినియోగానికైనా పనికిరాకపోవునా? అనే భావం చూచాయగా నాలో గలగడంమాత్రం అబద్ధమని నేనూ అనలేను.

మేఘమాలకి సుతలాము కథలు రాయటం ఇష్టముండేదికాదు. నేను సాహిత్యరంగంలో ఎదురుచూస్తున్న పేరు ప్రఖ్యాతుల్ని గురించి ఊకదంపుడుగా కొట్టిన లెక్చర్ల ఫలితంగా చివరికి బ్రహ్మాండమ్మీంద వొప్పుకుంది. మేనరికము కాకపోయినా అంత కష్టముండకపోను.

కొన్నాళ్ళలోనే మేఘమాలకథలు పత్రికలలో తరచు అచ్చుకావడమూ, అంతో ఇంతో - కాగితపు ఖర్చులకైనా సరిపడే - పారితోషికం ఇటు మెయిలులో రావడమూ జరగ సాగింది. కొన్ని పత్రికలనుండి ప్రత్యేక ఆహ్వానాలుకూడా - రచనలకోసం రాసాగాయి.

మేఘమాల పేరులోకి వచ్చాక నాపేరున కథలుఅచ్చు కావడం దాదాపు - లేదనే చెప్పాలి. దాని కారణం నాకు తీరిక లేకపోవడమూ, ప్రభుత్వోద్యోగంలోచేరడమూ మగవాళ్ళ రచనలకి స్త్రీల రచనలకు ఇచ్చినంత విలువ ఇతరు లివ్వక పోవడమూను.

భోజనంచేసి పడకకుర్చీలో జారపడి దినపత్రిక తిరగ వేస్తున్నానన్నమాటేగాని, పైభావాలన్నీ నా మెదడులో మెదల సాగాయి. కళ్లుమాత్రం వృథాగా పంక్తుల్ని చదువుతు తమ విధిని నెరవేర్చుకుంటున్నాయి.

మేఘమాల పనుల్ని పూర్తిచేసుకు వచ్చింది. కూడా మోసుకొచ్చిన మల్లెపు లవాసన నాకు ఇహలోకపు స్పృహ కలిగించింది.

"కళాంజలి" వారికి కథ రాయడం ఈవేళన్నా వుందా? అప్పుడు వాళ్లకిచ్చిన గడువుకూడా దాటిపోతోంది.

"ఈవేళ వ్రాస్తేసరి" అన్నాను.

మేఘమాల కాగితాలూ, కలము అన్నీ సద్దుకుంది. ఈలోపల నేను ఆలోచించుకొని కథను చెప్పనారంభించాను. మేఘమాల ముత్యాల్లాంటి అక్షరాల్తో ఆకథను వ్రాయ సాగింది.